మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

క్రీడాకారులతో అధికారులు

మదనాపురం, సెప్టెంబర్ 11 : మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు బుధవారం మండల కేంద్రంలోని జజెడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభించినట్లు హెచ్ఎం మద్దిలేటి తెలిపారు. ఈ పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్టీఎఫ్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, ఎంఈవో కృష్ణయ్య, మండల నోడల్ అధికారి ఫరూక్ హుస్సేన్ హాజరై ప్రారంభించారు. క్రీడాపోటీలకు మదనా పురం, కేజీబీవీ, అజ్జకొల్లు, దుప్పల్లి, కొన్నూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని హెచ్ఎం మద్దిలేటి తెలిపారు. పోటీలు నిర్వహించేందుకు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

సొంత భవనాన్ని నిర్మించాలి

గద్వాల అర్బన్,సెప్టెంబర్ 11 : జిల్లా కేంద్రానికి సమీపంలో ఆర్టీవో కార్యాలయం వెనుక ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు సొంత భవనాన్ని తక్షణమే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ సంఘం సభ్యులు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని పాఠశాల వద్ద సొంత భవనం ఏర్పాటు చేయాలని బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత భవనం లేక విద్యార్థినులు చాలా ఇబ్బందులకు గురైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి సొంత భవనం ఏర్పాటు చేసే విధంగా చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వినోబా భావే జయంతి

నివాళులర్పిస్తున్న సర్వోదయ మండలి సభ్యులు

మల్దకల్, సెప్టెంబర్ 11 : మండలంలోని ఎల్కూర్ గ్రామంలో బుధవారం సర్వోదయ (భూదాన్ యజ్ఞ బోర్డు) జోగుళాంబ గద్వాల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆచార్య వినోబా భావే జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి రంగన్న, కమిటీ సభ్యులు వెంకటేశ్, నాగరాజు, తిరుమల్, తిమ్మప్ప, మల్లికార్జున్, ఆంజనేయులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలి

• డీఈవో రవీందర్

డీఈవో రవీందర్‌ను సన్మానిస్తున్న పదోపటాలం ఆర్ఐ వెంకటేశ్వర్లు

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 11 : ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో రవీందర్ సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. ముందుగా ఎర్రవల్లి జెడ్పీహెచ్ఎస్‌లో రికార్డును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదోపటాలంలోని సాయుధవైతన్య పాఠశాలను పరిశీలించారు. పదోపటాలం ఆర్ఐ వెంకటేశ్వర్లు, హెచ్ఎం షాషావలి, డీఈవోను ఘనంగా సన్మానించారు.

మెనూ పాటించాలి..

గద్వాల రూరల్,సెప్టెంబర్11: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని డీఈవో రవీందర్ అన్నారు. మండలంలోని అనంతపురం జెడ్పీహెచ్ఎస్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ పాటిస్తూ భోజనం అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. వంటగదులు పరిశుభ్రంగా ఉండాలని ఇటీవల వర్షాల కురిసిన వర్షాల వల్ల దోమలు, ఈగల వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందుకని పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ప్రాగటూరు రోడ్డు బాగు చేయాలి

ఉండవెల్లి, సెప్టెంబర్ 11 : మండలకేంద్రం నుంచి ప్రాగటూర్ వరకు వెళ్లే బీటీ రోడ్డు గుంతల మయంగా మారిందని రహదారికి మరమ్మతులు చేయాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఎంపీ డీవో తిరుపతన్నకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ కొంతకాలంగా బీటీరోడ్డు గుంతలమయంగా మారడంతో బైక్‌పై వెళ్లే ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు చేరుకోలేకపోతున్నారన్నారు. అలాగే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో తక్కశిల, కంచుపాడు, తక్కశిల, ప్రాగటూర్ గ్రామాల ఉపాధ్యాయులు నాగరాజు, రామకృష్ణ, సామ్సన్, సుందర్‌రెడ్డి, దాదామియ్య, ప్రసన్న, ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలి

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్న నాయకులు

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 11 : ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని తపస్ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తపస్ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను క్లియర్ చేసి డిప్యూటీ డీఈవో, ఎంఈవో, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలతోపాటు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, కేజీబీవీ ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ మినీమం టైం స్కేల్ ఇవ్వాలని, బీఈడీ చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మోడల్ స్కూల్ గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని 317బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీజీ విష్ణువర్ధన్, రాష్ట్ర మీడియా కో-కన్వీనర్ సుభాష్, మండల ప్రధాన కార్యదర్శి రాకేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవి కిరణ్, శంకర్‌సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీచుపల్లి క్షేత్రంలోని పుష్కరఘాట్ వద్ద నిమజ్జనానికి తరలివచ్చిన వినాయకులు

పార్వతీ పుత్రుడికి ప్రత్యేక పూజలు

అయిజ, సెప్టెంబర్ 11 : మున్సిపాలిటీలోని పలు కాలనీలలో కొరువు దీరిన పార్వతి పుత్రుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం కొత్త బస్టాండ్ సమీపంలోని వరసిద్ధి వినాయక మండపంలో 'హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్' అధ్యక్షుడు సీసల రతన్నసింహారెడ్డి గణనాథుడిని దర్శించుకుని భగవద్గీత పుస్తకాలను భక్తులకు అందజేశారు. టీచర్స్‌కాలనీ గణేషుడి లడ్డూను నంద్యాల సువర్ణ రూ. 31వేలకు కైవసం చేసుకున్నది. గణనాథుడిని నిమజ్జనానికి తరలించడంతో వినాయకుడి లడ్డూ, పూజా సామగ్రిని వేలం నిర్వహించారు.

గణేశ్ లడ్డూ @ రూ.1,61,116

మదనాపురం, సెప్టెంబర్ 11 : మండల కేంద్రంలోని చిన్న అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన బాల గణపతి విగ్రహాన్ని మంగళవారం రాత్రి నిమజ్జనం చేశారు. ప్రధాన చౌరస్తాలో హనుమాన్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన లడ్డూ వేలంలో స్థానిక యువతతో పాటు విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు వాట్సాప్ ద్వారా పోటీపడ్డారు. చివరికి అమెరికాలో చదుకుంటున్న నితిన్‌కుమార్ కౌషిక్ అనే విద్యార్థి రూ.1,61,116 వేలంలో లడ్డూ దక్కించుకున్నాడు. ప్రొఫెసర్ జయంకర్ జూనియర్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లెడబిన్నెలో లడ్డూ వేలం

వడ్డేపల్లి, సెప్టెంబర్ 11 : మండలంలోని జిల్లెడదిన్నె గ్రామంలోని ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం పెద్ద లడ్డూకు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన స్వాములు రూ. 42వేలకు దక్కించుకున్నారు. అలాగే చిన్న లడ్డూను రవి రెడ్డి రూ.18వేలకు దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జనానికి రాజోళి తుంగభద్రానదికి తరలించారు.

వడ్డేపల్లిలో..

వడ్డేపల్లి, సెప్టెంబర్ 11 : మండలంలో ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల వద్ద పూజలందుకున్న లడ్డూలను వేలం వేయగా భక్తులు కొనుగోలు చేశారు. కొంకలలో 17 విగ్రహాలు ప్రతిష్ఠించగా మద్దూరు రామకృష్ణ రూ.5వేలకు, కుర్వ మోహన్ రూ. 1,800, నాగరాజు రూ. 3,600, దేవేంద్ర రూ.15,200, చెన్నుపాటి రాముడు రూ. 10వేలకు, కొండేటి జమ్మన్న రూ. 10, 600, వడ్డె పాండు రూ. 4వేలకు, కుర్వ శంకర్ రూ. 22,100, నడిపి మద్దిలేటి రూ.4,600, జయరాముడు రూ.3,100, వీరేశ్ రూ.8వేలకు, భీమేశ్ రూ.5,500, పరశురాముడు రూ. 14వేలకు, వెంకటనాయుడు రూ. 5,500, ఓబుల్లన్న రూ.7,300, ఆంజనేయులు గౌడ్ రూ. 12,200లకు, వడ్డె ఈశ్వర ప్ప రూ. 12,700లకు కొనుగోలు చేశారని భక్త మండలి వారు తెలియజేశారు. అనంతరం నిమజ్జనానికి రాజోళికి తరలించారు.

అన్నదానం..

కొత్తకోట, సెప్టెంబర్ 11: పట్టణంలోని రామాలయం వద్ద ప్రతిష్ఠించిన మట్టి గణనాథుని వద్ద బుధవారం హిందువాహిని ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుంతమౌనిక, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేశ్, హిందు వాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన వినాయకులు

ఇటిక్యాల, సెప్టెంబర్ 11: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో కొలువుదీరిన వినాయకులు బుధవారం ఐదో రోజు నిమజ్జన కోసం బీచుపల్లి క్షేత్రంలోని పుష్కరఘాట్‌కు తరలివచ్చాయి.

పడేసిన బ్లూచిప్

సెన్సెక్స్ 398, నిఫ్టీ 122 పాయింట్ల పతనం

ముంబై, సెప్టెంబర్ 11: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాలోకి జారుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడంతో ప్రారంభంలో లాభపడిన సెన్సెక్స్ చివర్లో భారీగా నష్టపోయింది. అటు నిఫ్టీ తన 25 వేల మార్క్ దిగువకు పడిపోయింది. టాటా మోటర్స్, రిలయన్స్, ఎల్ అండ్‌టీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాలవైపు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 398.13 పాయింట్లు కోల్పోయి 81,523.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 122.65 పాయింట్లు కోల్పోయి 24,918.45 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో టాటా మోటర్స్ అత్యధికంగా 6 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కూడా నష్టపోయాయి. కానీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు మాత్రం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 70 డాలర్ దిగువకు పడిపోయినప్పటికీ ఆసియా మార్కెట్లలో కరెక్షన్ జరిగిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. చైనా ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్నదన్న వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను నిరాశపరిచిందన్నారు. రంగాలవారీగా ఆయిల్ అండ్ గ్యాస్ 2.25 శాతం, మెటల్ 1.35 శాతం, యుటిలిటీ 1.29 శాతం, ఆటో 1.17 శాతం, కమోడిటీస్ 1.14 శాతం, టెలికం రంగ షేర్లు కుదేలయ్యాయి.

వాణిజ్య

మేకిన్ తెలంగాణే లక్ష్యం

ఏఐని అందరికీ అందుబాటులోకి తేవాలి • రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

క్యూనీఎఫ్ఐ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా 'మేకిన్ తెలంగాణ' భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామిక రంగానికి పిలుపునిచ్చారు. దేశీయ మార్కెట్‌లో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూనీఎఫ్ఐ) హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును బేగంపేటలోని ఓ హోటల్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తే దేశమంతా మనవైపు చూస్తుందన్నారు. ఇక ఉద్యోగుల సృజనాత్మకతను వెలికితీసి ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు క్వాలిటీ ఫోరం చేస్తున్న కృషిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని కొనియాడారు. క్వాలిటీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, ఆర్టీసీ, థర్మోపాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్‌కో, కెసీపీ సిమెంట్స్, హెఏఎల్, మిధాని, బీఈఎల్ సంస్థలకు ఈ సందర్భంగా మంత్రి ప్రోత్సాహకాలు అందజేశారు.

కృత్రిమ మేధను ప్రోత్సహిస్తాం

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రోజువారీ కార్యక్రమాల్లోనూ ఏఐ భాగమైపోయిందని, దీనిని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన విధానాలతో ముందుకుపోతోందని చెప్పారు. ఇందులో భాగంగానే విద్యార్థుల భవిష్యత్ అవసరాలు తీర్చేలా స్కిల్డ్ వర్కిటీల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏఐ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం జాతీయ చైర్మన్ శ్యామ్ మోహన్, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బాలకృష్ణరావులు కూడా మాట్లాడారు.

2 రోజుల్లో 1,000 అప్

మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: బంగారం మళ్లీ ప్రియమవుతున్నది. ప్రస్తుత పండుగ సీజన్‌కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో గడిచిన రెండు రోజుల్లో పుత్తడి ధర రూ.1,000 ఎగబాకింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం ధర మరో రూ.500 పెరిగి రూ.74,600 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.74,100గా ఉన్నది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామికవర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఉండటంతో కిలో వెండి రూ.500 అధికమై రూ.85 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 22 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.380 అధికమై రూ.67,150కి చేరుకోగా, 24 క్యారెట్ ధర రూ.410 ఎగబాకి రూ.73,250కి చేరుకున్నది. అలాగే కిలో వెండి రూ.500 ఎగబాకి రూ.91,500 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 2,550.90 డాలర్లు పలుకగా, వెండి 29.11 డాలర్లకు చేరుకున్నది.

మళ్లీ భారత్‌కు ఫోర్డ్?

ఎంజీ మోటర్ సరికొత్త ఈవీ

న్యూఢిల్లీ/చెన్నై, సెప్టెంబర్ 11: భారతీయ మార్కెట్‌కు గుడ్‌బై చెప్పిన అగ్రరాజ్యం ఆటో దిగ్గజం ఫోర్డ్.. త్వరలోనే రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. ఆ సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ రాష్ట్రంతో మూడు దశాబ్దాలుగా ఉన్న అనుబంధాన్ని కొనసాగించాలని, చెన్నైలోని ప్లాంట్‌ను తిరిగి తెరవాలని స్టాలిన్ కోరారు. ఈ మేరకు తమిళనాడు సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దీంతో ఫోర్డ్ పునరాగమనంపై తిరిగి అంచనాలు ఏర్పడుతున్నాయి. కాగా, 2021లో భారతీయ మార్కెట్ నుంచి ఫోర్డ్ వైదొలగిన విషయం తెలిసిందే. భారీ నష్టాల తోనే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నది. అంతే గాక చెన్నైలోని తమ ప్లాంట్‌నూ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు అమ్మాలనుకున్నది. అయితే గత ఏడాది డిసెంబర్‌లో ఈ ప్రణాళికల నుంచి వెనక్కి తగ్గింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో కొత్త ప్రణాళికలకు శ్రీకారం కూడా చుట్టింది. అయితే మళ్లీ పెద్దగా కదలికలేవీ లేక పోవడంతో ఫోర్డ్ రాక సందిగ్ధంలో పడింది. కానీ స్టాలిన్ అభ్యర్థనకు ఫోర్డ్ నుంచి సానుకూల స్పందనే వచ్చినట్టు తెలుస్తున్నది. దీంతో ఫోర్డ్‌పై మళ్లీ ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. ఇదిలావుంటే చెన్నై ప్లాంట్‌లో హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ)ను తయారు చేసేందుకు ఫోర్డ్ ఆసక్తితో ఉన్నట్టు సమాచారం. 1990లో ఫోర్డ్.. భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించింది. 2019లో మహీంద్రా అండ్ మహీంద్రాతో జట్టు కట్టినా కలిసిరాలేదు. కరోనా పరిస్థితుల నడుమ పూర్తిగా దేశీయ మార్కెట్‌కు దూరమైంది.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ఎంజీ మోటర్.. దేశీయ మార్కెట్లోకి మరో ఈవీని పరిచయం చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 38 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కలిగిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 331 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 15.6 ఇంచుల టచ్‌స్క్రీన్, 8.8 ఇంచుల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, వైర్‌లెస్ ఫోన్ చార్జింగ్, ఆటోమేటిక్ ఏసీ, ఆరు ఎయిర్‌బ్యాగ్, ట్రైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. 3.3 కిలోవాట్ల ఏసీ చార్జర్ 13.8 గంటల్లో బ్యాటరీ చార్జింగ్ కానుండగా, 7.4 కిలోవాట్ల బ్యాటరీ 6.5 గంటల్లో, 50 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ చార్జర్ కేవలం 55 నిమిషాల్లో పూర్తిగా రీచార్జికానున్నది. టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ 400, టాటా పంచ్‌లకు పోటీగా ఈ మాడల్‌ను ప్రవేశపెట్టింది.

డిసెంబర్ 11 నుంచి 'భౌమా కొనెక్స్‌పో'

హైదరాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్‌తో కలిసి 'మెస్సె ముంచన్ ఇండియా' సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి 14 వరకు గ్రేటర్ నోయిడాలో 'భౌమా కొనెక్స్‌పో ఇండియా' జరుగుతున్నది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో మంత్రిత